

# సైబర్ నేరస్తుడు మళ్లీ అరెస్ట్

## బెయిల్ కండిషన్లు ఉల్లంఘించడంతో సీరియస్

సైబర్ నేరానికి పాల్పడి కొద్ది రోజులు జైలు శిక్ష అనుభవించిన సంజీత్ కుమార్ సింగ్ అలియాస్ పింటూ సింగ్ కు కోర్టు శరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ప్రతి ఆదివారం వరంగల్ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంతకం చేయాలని శరతు విధించారు. అయితే నింధితుడు ఈ నెల 3న పోలీస్ స్టేషన్ లో హాజరు కాలేదు. దీంతో సైబర్ క్రైం ఏసీపీ గిరికుమార్ కల్కోట కోర్టులో మోమో వేశారు. దీంతో స్పందించిన కోర్టు నింధితుడిని మళ్లీ అరెస్ట్ చేయాలంటూ ఈ నెల 19న ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు 24న నింధితుడిని మరోమారు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా పరకాల సబ్ జైల్ కు తరలించారు. – **వరంగల్ వాయిస్, క్రైం**


# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 288

పేజీలు : 08 | వెల: రూ.5/-

సోమవారం

ఆగస్టు 25, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




## నాగరాజును పరామర్శించిన జర్నలిస్టులు

సీనియర్ జర్నలిస్ట్, స్పాట్ వాయిస్ పత్రిక డైరెక్టర్ పల్లెబోయిన నాగరాజు ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందిన నేపథ్యంలో సీనియర్ జర్నలిస్టులు సోమవారం పరామర్శించారు. ఈ మేరకు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, వరంగల్ వాయిస్ పత్రిక ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, సీనియర్ జర్నలిస్టులు సీహెచ్ సోమనర్సయ్య, రాచర్ల ఓంకార్, బండి రాజు, స్పాట్ వాయిస్ పత్రిక ఎడిటర్ చేలిక రాజేంద్ర ప్రసాద్, సీనియర్ జర్నలిస్టులు ధనుంజయ, సలేంద్ర రవీందర్ తదితరులు నాగరాజును పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

– వరంగల్ వాయిస్, హనుమకొండ

---



## మీనాక్షి నటరాజన్‌కు ఘన స్వాగతం

జనహిత పాదయాత్రలో భాగంగా సోమవారం హనుమకొండకు విచ్చేసిన తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి నటరాజన్ లకు ఘన స్వాగతం పలికారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పూల బొకే అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, కంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. – **వరంగల్ వాయిస్, హనుమకొండ**




8లో..

## మట్టి గణపతులను పూజించండి

- పర్యావరణాన్ని కాపాడండి
- ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్ రతన్ సింగ్ ఠాకూర్



# గోస తీరేనా..!


## యూరియా దొరికేనా..?

- ఆందోళనలో రైతులు
- తాడిచెర్ల పీఏసీఎస్ ఎదుట బారులు తీరిన రైతులు
- క్యూ లైన్ లో చెప్పులు పెట్టి నిరసన
- ఒక్కొక్కరికి 4 బస్తాలివ్వాలంటూ డిమాండ్



యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. పంపిణీ కేంద్రాల వద్ద తెల్లవారుజాము నుంచే బారులు తీరుతున్నారు. క్యూలైన్లలో ఆధార్ కార్డులు, పాసు పుస్తకాలు, చెప్పులు పెట్టి నిరీక్షిస్తున్నారు. ఒక్కో రైతుకు ఒక్క బస్తా మాత్రమే పంపిణీ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుకు సరిపడ యూరియా అందించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. అన్నం పెట్టే రైతులను ఆగం చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. అయితే ఆయా జిల్లాల కలెక్టర్ల ప్రకటనలు మాత్రం భిన్నంగా ఉన్నాయి. ప్రభుత్వానికి వంత పాడేందుకే జిల్లాల్లో ఎక్కడా యూరియా కొరత లేదంటూ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ప్రకటనలకు క్షేత్ర స్థాయి పరిస్థితులకు ఎక్కడ పొంతన కుదరకపోవడంపై అయోమయ పరిస్థితి నెలకొంది. తాజాగా మల్హార్ మండలంలోని తాడిచెర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి సోమవారం ఉదయం 440 బస్తాల యూరియా లోడ్ వచ్చిందనే సమాచారం మేరకు మండలంలోని పలు గ్రామాల రైతులు పెద్ద ఎత్తున పీఏసీఎస్ కేంద్రానికి తరలి వచ్చారు. వచ్చిన యూరియా బస్తాలకంటే రెట్టింపు సంఖ్యలో రైతులు క్యూ కట్టడంతో తోపులాట జరిగింది. తెల్లవారు జామునుంచే చంటి పిల్లలతో గంటల తరబడి క్యూ లైన్ లో ఉన్నప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో ప్రభుత్వాన్ని శాపనార్థాలు పెడుతూ రైతులు ఇంటి బాట పట్టారు.

–వరంగల్ వాయిస్, మల్హార్



వివరాలు 2లో..



# గోస తీరేనా..!

## యూరియా దొరికేనా..?

- ఆందోళనలో రైతులు
- తాడిచెర్ల పీఏసీఎస్ ఎదుట బారులు తీరిన రైతులు
- క్యూ లైన్ లో చెప్పులు పెట్టి నిరసన
- ఒక్కొక్కరికి 4 బస్తాలివ్వాలంటూ డిమాండ్

**వరంగల్ వాయిస్, మల్హర్ :** రైతులను యూరియా కష్టాలు వెంటాడుతనే ఉన్నాయి. సకాలంలో యూరియా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు మండల వ్యాప్తంగా వరి నాట్లు పూర్తి అయ్యాయి. దీంతో పొలాల్లో యూరియా చల్లడానికి రైతులు ఎరువుల దుకాణాలకు పరుగులు పెడుతున్నారు. ఎరువుల దుకాణాల్లో యూరియా అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మండలంలోని తాడిచెర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి సోమవారం ఉదయం 440 బస్తాల యూరియా లోడ్ వచ్చింది. సమాచారం అందుకున్న మండలంలోని పలు గ్రామాల రైతులు ఉదయం నుండే ఆధార్ కార్డులు, పట్టా పాస్ బుక్కులతో సహకార సంఘం కార్యాలయం ఎదుట బారులు తీరారు.

### నాలుగు బస్తాలివ్వాలి..

తాడిచెర్ల పీఏసీఎస్ ప్రాంతంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో క్యూ లైన్ లలో రైతులు చెప్పులు ఉంచి సమీపంలోని చెట్ల కిందికి చేరారు. కార్యాలయ సిబ్బంది ఒక్కో రైతుకు ఒక్క యూరియా బస్తా ఇవ్వడానికి నిర్ణయించడంతో రైతులు ఆందోళనకు దిగారు. ఒక్క యూరియా బస్తా ఎలా సరిపోతుందంటూ నిలదీశారు. గత పది సంవత్సరాలుగా ఇటువంటి పరిస్థితులు లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్లే యూరియా కొరత రైతులను నిండా ముంచుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి ఒక్కో రైతుకు కనీసం నాలుగు యూరియా బస్తాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు ఉదృతం చేస్తామంటూ రైతులు హెచ్చరించారు.



### కాంగ్రెస్ ను గెలిపించినందుకే..

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** యూరియా కోసం పడి కాపులు గాయాల్సిన ఆనాటి రోజులను కాంగ్రెస్ మళ్లీ తీసుకొచ్చిందని మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఆరోపించారు. సోమవారం కురవి మండల కేంద్రంలోని సహకార బ్యాంకు ఆవరణలో యూరియా కొరకు రైతులు చేస్తున్న ధర్నాలో రెడ్యానాయక్ పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ పాలనలో ఎరువుల కోసం రైతన్నలు తిప్పలు పడుతున్నారన్నారు. కేసీఆర్ హయాంలో కూడా యూరియా ఇవ్వడానికి కేంద్రం సహకరించలేదనీ, ఇది ముందే గ్రహించిన కేసీఆర్ రెండు నెలల ముందే యూరియా బస్తాలను తీసుకువచ్చి గోడౌన్లలో నిలువ చేశారన్నారు. యూరియా బస్తాలు కావలసిన రైతులు నడుచుకుంటూ వెళ్లి తెచ్చుకున్నారని గుర్తు చేశారు. తెలంగాణను దోచుకోవడానికే జట్టు కట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. రైతులకు ఎరువుల బస్తాలు అందించలేని చేతకాని దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వం అంటూ మండి పడ్డారు. ప్రజా పాలన తెచ్చిన మార్పు ఇదేనా అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి జరిగిన నష్టాన్ని గమనించిన ప్రజలు మారు కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటేసేందుకు సిద్ధంగా లేరన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకులు, మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, రైతులు, యువకులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడుదాం

- మట్టి వినాయకులను పూజిద్దాం..
- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్





**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వినాయక విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు, రసాయనాల వినియోగించడంతో జల వనరులు కాలుష్యానికి గురవుతాయాని, అందుచేత కృత్రిమ రంగులు, రసాయనాలతో చేసిన విగ్రహాలను కాకుండా మట్టితో తయారు చేసిన విగ్రహాలను పూజించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణం పట్ల ప్రజల్ని చైతన్యపరిచే విధంగా గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మట్టి గణపతులను ప్రతిష్టించి పూజిద్దాం అనే నినాదంతో రూపొందించిన పోస్టర్ ను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రతి జిల్లాకు రెండు వేల మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి.గణేష్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సునీత, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### గ్రీవెన్స్ ఫిర్యాదులు పెండింగ్ లో ఉంచొద్దు

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పెండింగ్ లో ఉండకుండా, వాటిని త్వరగా పరిష్కరించాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 177 అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఆర్ఓ వైవి గణేష్, డీఆర్డీఓ మేన శీను, హనుమకొండ పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కె.నారాయణ, ముఖ్య ప్రణాళిక అధికారి సత్యనారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసిల్దార్లు పాల్గొన్నారు.



# గ్రీవెన్స్‌కు 88 దరఖాస్తులు

- పరిష్కరించడంలో అలసత్వం తగదు
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం తగదని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వాటి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించినవి 34, హెల్త్ & సానిటేషన్ ఆరు, ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ) ఒకటి, టౌన్ ప్లానింగ్ విభాగంలో 45, నీటి సరఫరాకు రెండు మొత్తం 88 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇంచార్జి ఎస్ఈ, సిటీ ప్లానర్ లు మహేందర్, రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, హెచ్ఓ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తం..

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాటల రూపంలో ప్రజల్లో చైతన్యం కలిగించడానికి ఏర్పాటు చేసిన కళాజాత ప్రదర్శన కార్యక్రమాన్ని బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, సూపరిండెంట్ దేవేందర్, సానిటరీ సూపర్ వైజర్ లు భాస్కర్, గోల్కొండ శ్రీను, సానిటరీ ఇన్స్పెక్టర్ లు ప్రకాశ్, భీమయ్య, అనిల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రజాహిత యాత్రను వ్యతిరేకిస్తున్నాం



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** కాంగ్రెస్ ప్రభుత్వం లగచర్ల ఫార్మ్ కంపెనీలకు లంబాడీలు భూములు ఇవ్వలేదనే కోపంతోనే రాష్ట్రంలో 35 లక్షల జనాభా ఉన్న లంబాడీలకు కేబినెట్‌లో ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వకుండా వివక్ష చూపుతోందని బీజేపీ జిల్లా ఎస్టీ మోర్చా నాయకులు గుగులోత్ తేజ నాయక్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'జనహిత పాదయాత్ర' సందర్భంగా వర్ధన్నపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోయలు, లంబాడీల మధ్య చిచ్చు పెట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారని తేజ నాయక్ దుయ్యబట్టారు. లంబాడా ఓట్లతోనే అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎస్టీ రిజర్వేషన్ల నుంచి లంబాడీలను తొలగించాలని చూడటం అవివేకమని తేజ నాయక్ మండిపడ్డారు. ఈ విషయమై హైకోర్టులో కేసులు పెట్టించి లంబాడీలను ఇబ్బందులు పెడుతున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ పార్లమెంటు సభ్యుడు సోయం బాబురావు, భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావులతో సుప్రీంకోర్టులో కేసులు వేయించి లంబాడీలను ఎస్టీ రిజర్వేషన్ల నుంచి తొలగించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర పడుతోందని తేజ నాయక్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ కేసులను వేయిస్తున్నప్పటికీ బహిరంగంగా ఒప్పుకోలేని దుస్థితిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉందని ఆయన అన్నారు. లంబాడీలు అధికంగా ఉన్న వర్ధన్నపేటలో కాంగ్రెస్ చేపట్టిన 'ప్రజాహిత పాదయాత్రను' బీజేపీ మండల పార్టీ తరపున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ మండల ఎస్టీ నాయకులు గుగులోతు లక్పతి, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షులు భూక్యా శ్రీనివాస్, మండల పార్టీ కార్యవర్గ సభ్యులు నార్యా నాయక్, ఎస్టీ మోర్చా మండల నాయకులు భూక్యా యాఖూబ్, భూత్ అధ్యక్షులు గుగులోతు దేవేందర్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి వినోద్, జిల్లా మహిళా మోర్చా మాజీ కార్యదర్శి గుగులోతు సునీత తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ చోరీ నిరహారదీక్షకు ప్రణవ్ సంఘీభావం




**వరంగల్ వాయిస్, హుజురాబాద్ :** యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్ రెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్‌లో జరుగుతున్న ఓట్ చోరీ నిరహారదీక్షకు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ ఓట్ చోరీపై ఆధారాలతో సహా నిరూపించారని, దీనిపై ఎన్నికల కమిషన్ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాన కూడళ్లలో ఇలాంటి దీక్షల వల్ల ప్రజలకు ఓటు చోరీపై మరింత అవగాహన పెరుగుతుందని వొడితల ప్రణవ్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు యువజన కాంగ్రెస్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మండల్ కమిషన్ సిఫారసుల అమలుతోనే సామాజిక న్యాయం



**వరంగల్ వాయిస్, సుబేదారి :** మండల కమిషన్ సిఫారసుల కారణంగానే ఇతర వెనుకబడిన తరగతులకు (ఓబీసీ) కేంద్ర విద్య, ఉద్యోగాలలో 27 శాతం రిజర్వేషన్లు సాధ్యమయ్యాయని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ సుంకర జ్యోతి అన్నారు. సోమవారం డాక్టర్ తిరునహరి శేషు ఆధ్వర్యంలో జరిగిన బీపీ మండల్ 107వ జయంతి కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జ్యోతి మాట్లాడుతూ మండల్ కమిషన్ సిఫారసుల ప్రకారం కేంద్ర విద్యా, ఉద్యోగాలలో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉన్నా, కేవలం 22 శాతానికి మించి దక్కడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం బీసీ నాయకుడు డాక్టర్ తండు నాగయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన ఏడు దశాబ్దాల తర్వాత కూడా కాకా కలేల్కర్, మండల్, జస్టిస్ రోహిణి కమిషన్ల నివేదికలను ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో అమలు చేయడానికి ముందుకు రాకపోవడం వల్ల ఓబీసీలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల్ కమిషన్ నివేదికను పూర్తిగా అమలు చేసినప్పుడే దేశంలో సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు డాక్టర్ ఎర్రబోజ్జు రమేష్, డాక్టర్ కరుణాకర్, డాక్టర్ ఫిరోజ్, డాక్టర్ వెన్నంపల్లి విజయకుమార్, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ దాసు, డాక్టర్ శ్రీలత, డాక్టర్ రమేష్, డాక్టర్ స్వామి, డాక్టర్ జయప్రకాశ్, డాక్టర్ తాళ్లపల్లి సంజీవ్, డాక్టర్ సదానందం, డాక్టర్ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్క్రాప్ షాపులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

## హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్



**వరంగల్ వాయిస్, హనుమకొండ క్రైం :** హనుమకొండ పరిధిలోని స్క్రాప్ షాపుల యజమానులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని హనుమకొండ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ సూచించారు. సోమవారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి, వారికి పలు మార్గదర్శకాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ శివకుమార్ మాట్లాడుతూ స్క్రాప్ షాపుల్లో ఎవరైనా అనుమానాస్పద వాహనాలు, ఇనుము, ఎలక్ట్రానిక్ వస్తువులను అమ్మడానికి ప్రయత్నిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే, గుర్తింపు లేని వస్తువులను కొనడం లేదా తీసుకోవడం చేయకూడదని, షాపుల్లో రిజిస్టర్‌ను సరిగా నిర్వహించాలని తెలిపారు. పోలీసులు సూచించిన నిబంధనలు పాటించని షాపులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్క్రాప్ షాపుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఉండాలని నొక్కి చెప్పారు. ప్రజలు కూడా అనుమానాస్పదంగా కనిపించే స్క్రాప్ షాపుల గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు కిషోర్, సతీష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# దాసు సురేష్‌కు పితృ వియోగం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ తండ్రి, రిటైర్డ్ సివిల్ ఎస్సై దాసు రఘురామ్ (60) ఆదివారం గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన పార్థివ దేహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించి, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దాసు రఘురామ్ మృతి పట్ల తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు, తెలంగాణ ఆన్ లైన్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి వేముల సదానందం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాసు సురేష్‌ను ఓదార్చి, మనోధైర్యం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరందాస్ యాదగిరి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దేవులపల్లి సాయిరాజ్, వైద్యం రాజగోపాల్, ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, గోరంటాల శ్రీనివాస పాల్గొన్నారు.

# ఇప్పుడు వరంగల్‌లో రెయిన్‌బో హాస్పిటల్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ ప్రజలకు అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలు అందించే లక్ష్యంతో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్ తమ సేవలను వరంగల్‌కు విస్తరించాయి. నగరంలో దశాబ్ద కాలంగా ఉన్న ప్రశాంతి హాస్పిటల్తో భాగస్వామ్యం కుదుర్చుకుని, రెయిన్‌బో తమ 20వ ఆసుపత్రిని ఇక్కడ ప్రారంభించింది. ఈ భాగస్వామ్యం ద్వారా ప్రశాంతి హాస్పిటల్ ఇకపై రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్ పనిచేస్తుంది. దీనిలో ముఖ్యంగా పిల్లలు, మహిళల కోసం ప్రత్యేకమైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ ఆసుపత్రిని ఎన్‌ఏబీహెచ్ (NABH) గుర్తింపు పొందిన 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేశారు. అధునాతన ఎన్‌ఐసీయూ (నవజాత శిశువుల ఐసీయూ), పీఐసీయూ (పిల్లల ఐసీయూ), ఇతర పీడియాట్రిక్ సేవలు. "బర్త్‌రైట్ బై రెయిన్‌బో" కార్యక్రమం కింద సాధారణ మరియు క్లిష్టమైన ప్రసవాలకు (హై-రిస్క్ ప్రెగ్నెన్సీ కేర్) ప్రత్యేక చికిత్స. పిల్లలు, మహిళల కోసం నిరంతర అత్యవసర సేవలు అందించనున్నారు. ఈ ప్రారంభోత్సవం సందర్భంగా రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ దినేష్ కుమార్ చీర్ల మాట్లాడుతూ ప్రశాంతి హాస్పిటల్ నమ్మకానికి తమ ఆధునిక సాంకేతికత, నైపుణ్యం తోడై వరంగల్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని తెలిపారు. ప్రశాంతి హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం వల్ల తమ ఆసుపత్రి వైద్య ప్రమాణాలు మరింత మెరుగుపడి, దేశంలోని అత్యుత్తమ వైద్య నిపుణులతో వరంగల్ ప్రజలకు ఉన్నతమైన వైద్యం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# 'జనహిత యాత్ర' ప్రజాహితం కాదు

## ◆ బీజేపీ నేత సిద్ధం నరేష్ పటేల్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్‌లో జరగనున్న కాంగ్రెస్ పార్టీ 'జనహిత యాత్ర'పై బీజేపీ నేత సిద్ధం నరేష్ పటేల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ యాత్ర ప్రజాహితం కోసం కాదని, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి చేస్తున్న మరో నాటకం అని ఆయన అభివర్ణించారు. అక్రమ అరెస్టులు చేసినంత మాత్రాన కాంగ్రెస్ ప్రభుత్వం చేసే అక్రమాలను ప్రజలు గ్రహించలేరు అనుకోవడం వారి మూర్ఖత్వం అని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసేది ప్రజాహింస అని ఆరోపిస్తూ, అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం చేతకాక, ప్రతిపక్షమైన బీజేపీపై తప్పుడు కేసులు పెట్టడం, అరాచక పాలన నడపడమే కాంగ్రెస్ నాయకుల పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. "కడుపులో కత్తులు పెట్టుకొని కౌగిలించుకునే పాషాండులు ఈ కాంగ్రెస్ నాయకులు" అని ఘాటుగా విమర్శించారు. రైతులకు కేంద్రం నుంచి సరిపడా యూరియా అందుతున్నా, దానిని రైతులకు చేరేలా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని నరేష్ పటేల్ ఆరోపించారు. "బీసీల ఎదుగుదల కాంగ్రెస్ నాయకులకు ఓర్వలేని విషయం" అని ఆయన అన్నారు. వరంగల్‌లో జరిగే "జనహిత యాత్ర"లో పాల్గొనే ముందు, ఆరు గ్యారంటీలు ఎందుకు అమలు చేయలేదో, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగుల పరిస్థితి ఏంటో, బీసీలకు ఎందుకు న్యాయం చేయడం లేదో మహేష్ కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్ జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సమాధానం చెప్పకపోతే కాంగ్రెస్ నాయకులను వరంగల్‌లో అడుగుపెట్టనివ్వబోమని హెచ్చరించారు. పోలీసులు కాంగ్రెస్ పార్టీకి భజన చేస్తున్నారని, తమను హౌస్ అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు మోసపోవడం మానేశారని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వ అసలు ముఖం బయటపడుతుందని, తెలంగాణలో బీజేపీనే నిజమైన ప్రత్యామ్నాయం అని ఆయన బలంగా చెప్పారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, ఆగస్టు 25, 2025

# మా డివిజన్ పై నిర్లక్ష్యం సరికాదు

**◆ కార్పొరేటర్ బైరి లక్ష్మీ కుమారి**



**హనుమకొండ, వరంగల్ వాయిస్:** గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీలోని 8వ డివిజన్‌లో మున్సిపల్ సిబ్బంది సరిగ్గా పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడం వల్ల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని బీజేపీ కార్పొరేటర్ బైరి లక్ష్మీ కుమారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రెండు నెలలుగా కుమార్ పల్లి మార్కెట్, టైలర్ స్ట్రీట్, ఏనుగుల గడ్డ ప్రాంతాల్లో శానిటేషన్ చేయకపోవడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని ఆమె ఆరోపించారు. వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడం వల్ల డెంగ్యూ వంటి రోగాలు ప్రబలుతున్నాయని కార్పొరేటర్ లక్ష్మీ కుమారి మండిపడ్డారు. డివిజన్‌కు ఒక జవాన్ (పారిశుద్ధ్య కార్మికుడు)ను నియమించాలని పలుమార్లు అధికారులను కోరినా ఫలితం లేదని ఆమె అన్నారు. ఈ నిర్లక్ష్యం కారణంగా డివిజన్‌లో దాదాపు 15 డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదయ్యాయని, దీంతో డీఎంహెచ్‌ఓ కార్యాలయం హుటాహుటిన హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తోందని ఆమె తెలిపారు. ఈ సమస్యపై మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ సీఎంహెచ్‌ఓలకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే జవాన్‌ను నియమించి పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు



**వరంగల్ వాయిస్, నడికూడ :** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని నడికూడ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి పిలుపునిచ్చారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని పులిగిల్ల, రాయపర్తి గ్రామాలలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశాల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయలేదని విమర్శించారు. రైతుల పంటల సాగుకు అవసరమైన యూరియాను కూడా అందుబాటులో ఉంచడంలో విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు మేడిపల్లి శోభన్, సమన్వయ కమిటీ సభ్యులు చందా కుమారస్వామి, నందికొండ జైపాల్ రెడ్డి, మచ్చ రవీందర్, భీముడి నాగిరెడ్డి, యూత్ నాయకులు ముస్కే రాము, సురాబు శ్రీకాంత్, గుడికందుల శివ, రాయపర్తి గ్రామ కమిటీ అధ్యక్షుడు పోశాల భిక్షపతి, అల్లె మహేందర్, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు

**వరంగల్ వాయిస్, కాజీపేట :** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్, అదనపు ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ డీసీపీ రాయల ప్రభాకర్ రావు ఆదేశాల మేరకు, ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారాయణ పర్యవేక్షణలో కాజీపేట ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 24 మంది పట్టుబడ్డారు. వీరిలో ముగ్గురు వ్యక్తులు మద్యం ఎక్కువగా సేవించినట్లు నిర్ధారణ కావడంతో వారిని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. నిందితులైన గోడిశాల సదాశువుడు, భాషబోయిన కుమారస్వామి, జరుపుల నిఖిల్ లకు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్.ఫాతిమా చిన్నప్ప రెండు రోజుల జైలు శిక్ష విధించారు. శిక్ష పడిన వారిని హుజురాబాద్ సబ్ జైలుకు తరలించినట్లు కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి. వెంకన్న తెలిపారు.

## బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం



**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక ఎన్నికల సన్నాహాల్లో భాగంగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు పరకాల మండలంలో బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించారు. యూత్ మండల అధ్యక్షుడు సనత్ కుమార్ పటేల్, మండల అధ్యక్షుడు చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో లక్ష్మీపురం, వెంకటాపురం, హైబోత్‌పల్లి గ్రామాల్లో ఈ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌కు ప్రజల్లో ఉన్న అభిమానాన్ని గుర్తించి, అభ్యర్థుల ఎంపికలో ఒకరిపై ఒకరు పోటీ పడకుండా, అందరూ ఏకగ్రీవంగా ఒక అభ్యర్థిని ఎన్నుకొని సహకరించుకోవాలని సూచించారు. లక్ష్మీపురం గ్రామంలో యువ నాయకుడు పల్లెబోయిన రాజును సర్పంచ్ అభ్యర్థిగా నిలబెట్టాలని ఈ సమావేశంలో తీర్మానించారు. యువ నాయకుడిని సర్పంచ్ అభ్యర్థిగా ప్రకటించడం పట్ల మండల యూత్ అధ్యక్షుడు సనత్ కుమార్ పటేల్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల పీఏసీఎస్ ఛైర్మన్ నాగయ్య, సమన్వయ కమిటీ సభ్యులు ఆముదలపెల్లి అశోక్, గురిజపల్లి ప్రకాష్ రావు, గంట సమ్మిరెడ్డి, కోరే రమేష్, మండల యూత్ ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## గోశాల ఉత్పత్తులతో రైతుల పెట్టుబడులు తగ్గుతాయి




**వరంగల్ వాయిస్, రేగొండ :** గోశాల ఉత్పత్తుల వాడకంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని హెచ్‌ఎంటీవీ ప్రతినిధి పల్లె రాములు అన్నారు. సోమవారం సిరికొండ తిరుపతి రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివ కేశవ గోశాల సేవా సమితిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పల్లె రాములు మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయం అభివృద్ధిపై రైతులలో అవగాహన పెంచడానికి గోశాల సేవా సమితి చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. గోశాల ఉత్పత్తుల వాడకంతో రైతుల పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు, సేంద్రీయంగా పండిన పంటలు ప్రజల ఆరోగ్యాన్ని కూడా కాపాడతాయన్నారు. ఈ గొప్ప ప్రయత్నానికి తన వంతు సహకారం అందిస్తానని ఆయన నిర్వాహకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు సేంద్రీయ వ్యవసాయం చేస్తున్న రైతులు పాల్గొన్నారు.

## గొత్తికోయ గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వాలి




**వరంగల్ వాయిస్, ములుగు :** పోడు భూమి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎంసీపీఐ పార్టీ ఆధ్వర్యంలో గొత్తి కోయ గిరిజనులు ములుగు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. సోమవారం మంగపేట మండలం బాలన్నగూడెం పంచాయతీ పరిధిలోని ఓంకార్‌నగర్‌లో నివాసం ఉంటున్న 40 గుత్తి కోయ కుటుంబాలతో కలిసి ఎంసీపీఐ కేంద్ర కమిటీ నాయకుడు సింగతి సాంబయ్య కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ పదేళ్లకు పైగా ఓంకార్‌నగర్‌లో నివాసముంటూ 20 ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటున్న గుత్తి కోయ గిరిజనులపై అటవీ శాఖ అధికారులు దాడులు చేయడం అన్యాయమని అన్నారు. జీవనోపాధి కోసం కష్టపడుతున్న వారిపై అధికారులు నిరంతరం వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులకు పట్టా పాస్ పుస్తకాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందని సాంబయ్య గుర్తు చేశారు. అటవీ అధికారుల దాడులను నివారించి, 20 ఎకరాల పోడు భూమికి పట్టాలు ఇప్పించి ఆ 40 కుటుంబాలను ఆదుకోవాలని ఆయన జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. గిరిజనులకు న్యాయం జరిగే వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని సాంబయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కన్వీనర్ దాసరి ముత్తయ్య, గుత్తి కోయ గిరిజనులు కోర్స లక్ష్మణ్, వట్టం జగన్, తెల్లం లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్రంలోని రేషన్ డీలర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్ బాబు ఆధ్వర్యంలో హనుమకొండ జాయింట్ కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బత్తుల రమేష్ బాబు మాట్లాడుతూ రేషన్ డీలర్లకు ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలల కమీషన్ డబ్బులు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కమీషన్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, భవిష్యత్తులో ప్రతినెలా కమీషన్‌ను ఆ నెలలోనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా రూ. 5000 గౌరవ వేతనం, కమీషన్ పెంపును రూ. 300కు వెంటనే ప్రకటించాలని కోరారు. ఇతర సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి చిలగాని మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ సామల మల్లయ్య, కోశాధికారి తోట సమ్మయ్య, ఉపాధ్యక్షులు పోతరాజు రమేష్, బత్తుల మహేష్, చందుపట్ల రాజేందర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఓబీసీల ఆరాధ్యుడు బీపీ మండల్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వెనుకబడిన తరగతుల (ఓబీసీ) ఆరాధ్య దైవం బిందేశ్వర్ ప్రసాద్ మండల్ జయంతి వేడుకలను 'ఆర్గనైజేషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్' హనుమకొండ వారి ఆధ్వర్యంలో మాస్టర్ జీ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుడా మాజీ చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సందర్ రాజు మాట్లాడుతూ, 80వ దశకంలోనే బీపీ మండల్ బీసీలు ఉన్నతంగా ఎదగడానికి సుమారు 40 ప్రతిపాదనలను తన కమిషన్ ద్వారా సమర్పించారని, కానీ వాటిలో కేవలం ఒకటి మాత్రమే అమలులోకి వచ్చిందని తెలిపారు. మొదటి నుంచి కూడా బీసీలకు న్యాయం జరగడం లేదని, కాబట్టి బీసీలందరూ రాజకీయాలకు, కులాలకు అతీతంగా ఏకమై తమ జాతి గౌరవాన్ని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో మహిళలు, యువత భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. గౌరవ అతిథిగా పాల్గొన్న కత్తి వెంకట స్వామి మండల్ సేవలను, వారి కృషిని వివరించారు. కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి సభ్యులు చిర్రా రాజు, బోనగని యాదగిరి గౌడ్, డాక్టర్ విజయలక్ష్మి, తాడిశెట్టి క్రాంతి కుమార్, వాద్నాల నరేందర్, పాక ఓం ప్రకాష్, మౌనిక తదితరులు మండల్ సేవలను స్మరించుకొని, బీసీల ఉన్నతికి అవసరమైన మార్గాలను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కాకతీయ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ అధ్యక్షత వహించారు. వొడితెల రాము కార్యక్రమం ముగింపు నివేదికను అందించారు.

# ఇండస్ట్రియల్ హబ్‌లో పరిశ్రమల ఏర్పాటు

◆ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి
◆ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, గణపురం :** భూపాలపల్లి నియోజకవర్గం, గణపురం మండలం, మైలారం గ్రామ శివారులోని 187 ఎకరాల గుట్టపై ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ హబ్లో పెట్టుబడులు పెట్టడానికి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) పిలుపునిచ్చారు. సోమవారం ఆయన రెవెన్యూ, ఇండస్ట్రీయల్, పోలీస్, ఇతర శాఖల అధికారులతో కలిసి అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మైలారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 204/1, 205/1 లో ఉన్న మొత్తం 187 ఎకరాల ప్రభుత్వ భూమిని సద్వినియోగం చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతాన్ని టూరిజం, ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, ఎంపీల సహకారంతో కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. పరిశ్రమల కోసం 60 ఎకరాల్లో 197 ప్లాట్లను కేటాయించారు. ఒక చదరపు అడుగుకు రూ.1600 చొప్పున త్వరలోనే టెండర్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వ్యాపారవేత్తలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్‌కు 40 ఎకరాలు, కేంద్రీయ విద్యాలయానికి 10 ఎకరాలు, సైనిక్ స్కూల్‌కు 20 ఎకరాలు, అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్‌కు 15 ఎకరాలు కేటాయించారు. ఇప్పటికే రోడ్డు పనుల కోసం రూ.4 కోట్లు ఖర్చు చేశారని, మరో రూ.15 కోట్ల నిధులు సమకూరుస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూరియా సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**వరంగల్ వాయిస్, దామెర :** మండల కేంద్రంలోని దామేశ్వర, పోచమ్మ దేవాలయాలను బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది కంటే కేంద్ర ప్రభుత్వం 20% అధికంగా యూరియాను సరఫరా చేసినప్పటికీ, ఆ యూరియాను రైతులకు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతులకు యూరియా కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు ఎంత అవసరమైతే అంత యూరియాను సరఫరా చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేమేందర్ రెడ్డితో పాటు దామెర మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్, నియోజకవర్గ కో కన్వీనర్ మాదారపు రతన్ కుమార్, రజినీకాంత్ రెడ్డి, మండల కార్యదర్శి మెరుగు శ్రీనివాస్, శక్తి కేంద్ర ఇన్చార్జి ఎక్కలదేవి రమేష్, మండల నాయకులు బత్తిని అనిల్ కుమార్, దామెర నాగరాజు, మాజీ బూత్ అధ్యక్షులు దామెర పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.




## మాదిగ జర్నలిస్ట్ ఫోరం జిల్లా జనరల్ సెక్రటరీగా శ్రీకాంత్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం హనుమకొండ జిల్లా జనరల్ సెక్రటరీగా పెద్దమ్మగడ్డకు చెందిన హన్మకొండ శ్రీకాంత్‌ను నియమించినట్లు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొల్లెపాక రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నియామకం ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ ఆదేశాల మేరకు జరిగిందని ఆయన పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా జర్నలిజంలో చురుకైన పాత్ర పోషిస్తూ, ప్రభుత్వం, ప్రతిపక్షాలపై విశ్లేషణాత్మక కథనాలు రాసిన శ్రీకాంత్, విద్య, ఆరోగ్య రంగాలపై సమగ్ర నివేదికలు సమర్పించి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన నిబద్ధత, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పదవికి ఎంపిక చేసినట్లు ఫోరం వెల్లడించింది. ఈ సందర్భంగా హన్మకొండ శ్రీకాంత్ మాట్లాడుతూ.. "జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య పరిష్కారమే నా తొలి ప్రాధాన్యం. వారి హక్కులు, భద్రత, సంక్షేమం కోసం అన్ని స్థాయిల్లో పోరాడతాను. అదేవిధంగా మాదిగ కమ్యూనిటీని వేధిస్తున్న సామాజిక, ఆర్థిక సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి ప్రభుత్వం స్పందించేలా కృషి చేస్తాను. కమ్యూనిటీ అభివృద్ధి, జర్నలిస్టుల బలోపేతం కోసం నేను ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తాను" అని తెలిపారు. తనకు ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర నాయకులు బొల్లెపాక రాజేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి పెండ్యాల సుమన్, జిల్లా అధ్యక్షుడు సందేల రాజుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# పండుగలను భక్తి భావంతో నిర్వహించుకోవాలి

◆ జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఉత్సవ కమిటీలకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో, ఉత్సవ కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గత సంవత్సరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్, మున్సిపల్, పంచాయతీ, పోలీస్ సిబ్బంది సమన్వయంతో జిల్లాలోని ములుగు, ఏటూరునాగారం, ముళ్ళకట్ట, రామన్నగూడెం, మంగపేట మండలాల్లోని లో–లెవెల్ విద్యుత్ తీగలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా నిమజ్జనానికి వెళ్లే మార్గాల్లో విద్యుత్ తీగల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, రూట్ క్లియరెన్స్ నివేదికను సమర్పించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు పూర్తి వివరాలను పోలీస్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని, తద్వారా అవసరమైన సేవలు అందించడానికి వీలుంటుందని తెలిపారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండటానికి, డీజే సౌండ్ సిస్టమ్‌లను అనుమతించవద్దని ఆయన స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్లు సీ.హెచ్.మహేందర్, సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, డీఎస్పీ రవీందర్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి..

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 51 దరఖాస్తులు రాగా అత్యధికంగా భూ సమస్యలు 20, హ నిర్మాణ శాఖ 10, పెన్షన్ 2, ఉపాధి కల్పన 2 , ఇతర శాఖలకు సంబంధించినవి 17 ఫిర్యాదులు అందాయి. అర్జీలను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు మానవతా దృక్పథంతో పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, డీఆర్డీఓ శ్రీనివాస్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కోతులు, కుక్కల బెడద పరిష్కరించాలి

కార్పొరేటర్ పల్లం పద్మ రవి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తూర్పు నియోజకవర్గం 32వ డివిజన్‌లోని ప్రజలు, ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు కోతులు, కుక్కల బెడదతో ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో, 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి సోమవారం జరిగిన గ్రీవెన్స్ సెల్ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. నగరంలో ముఖ్యంగా తమ డివిజన్‌లో కోతులు, కుక్కల బెడద ఎక్కువగా ఉందని, ఈ సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ విజ్ఞప్తి చేశారు.

## జనహిత పాదయాత్రలో కార్పొరేటర్ మామిండ్ల రాజు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజలకు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'జనహిత పాదయాత్ర'లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు వర్ధన్నపేట నియోజకవర్గంలో సోమవారం నిర్వహించిన జనహిత పాదయాత్రలో ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ పాదయాత్రలో పాల్గొనడానికి కార్పొరేటర్ మామిండ్ల రాజు ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షుడు సురేందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో బయలుదేరారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**వరంగల్ వాయిస్, మల్హర్/భూపాలపల్లి :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో కలిసి ఆయన ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 53 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు పరిష్కారం కోసం పంపినట్లు పేర్కొన్నారు. ప్రతి శాఖ అధికారి తమకు అందిన దరఖాస్తులను పూర్తిగా పరిశీలించి, నిర్దిష్ట సమయ వ్యవధిలోగా సమస్యలను పరిష్కరించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ రవి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని కోల్వాయి గ్రామంలో, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండి జితేందర్ రెడ్డి తండ్రి కొండి మాధవరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆయన దశదిన కర్మలో బీజేపీ రాష్ట్ర నాయకులు పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కట్ట సుధాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయచందర్, మాజీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల అశోక్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జ సత్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు. వారు మాధవరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్, మాజీ మండల అధ్యక్షులు జంగిలి నాగరాజు, గంకిడి బూచి రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

## ఇంటర్ బోర్డ్ జాయింట్ సెక్రటరీ వసుంధర దేవి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా ప్రమాణాలు అందించాలని, తద్వారా వాటిని బలోపేతం చేయాలని ఇంటర్ బోర్డ్ జాయింట్ సెక్రటరీ, వరంగల్ ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ కే.వసుంధర దేవి అన్నారు. సోమవారం ఆమె హనుమకొండ జిల్లాలోని కమలాపూర్, పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కళాశాల అభివృద్ధి కోసం ఇంటర్ బోర్డు మంజూరు చేసిన నిధులను సక్రమంగా వినియోగించుకుని, శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. అధ్యాపకులు మెరుగైన విద్యా ప్రమాణాలను పాటిస్తూ, విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచి, ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఆమె దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌లు మాధవి, సంపత్ కుమార్, జీజేఎల్ఏ స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఇ. శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# ‘జనహిత పాదయాత్ర’కు మీసాల ప్రకాష్



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** మాజీ ఎంపీ కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి దంపతుల ఆదేశాల మేరకు వర్ధన్నపేట నియోజకవర్గంలో చేపట్టిన జనహిత పాదయాత్రలో టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ పాదయాత్రలో ముఖ్య అతిథిగా ఏఐసీసీ, తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా, పాదయాత్రలో పాల్గొనేందుకు 18వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు బయలుదేరారు. టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సందెల లాజర్, బైరపాక డేవిడ్ రాజ్, మడిపల్లి ఫ్రాన్స్ జాషువా, గబ్బెటి సుధాకర్, యమడాల ప్రశాంత్, కొల్లూరి కన్నా, మేకల కన్నా, పోలేపాక బాబు, కూచన రవీందర్, బట్టి శేషు పాల్గొన్నారు.

# ధర్మస్థలి సంఘటనపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలి

## ◆ ప్రజా సంఘాల డిమాండ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కర్ణాటకలోని ధర్మస్థలిలో జరుగుతున్న సంఘటనలపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలని హనుమకొండలో పలు ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఆదివారం సాయంత్రం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. చైతన్య మహిళా సంఘం (సీఎంఎస్) జిల్లా కన్వీనర్ చంద్రకళ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కో-కన్వీనర్ రాధ, ఐద్వా రాష్ట్ర నాయకురాలు నలిగంటి రత్నమాల, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కార్యదర్శి రాచర్ల బాలరాజు, సీఎల్ సీ నాయకులు జయంత్, డీటీఎఫ్. నాయకులు ఉప్పలయ్య ప్రసంగించారు. వారు మాట్లాడుతూ సిట్ విచారణలో ధర్మస్థలి ప్రాంతంలో వందలాది శవాలను పాతిపెట్టానని చెప్పిన పారిశుద్ధ్య కార్మికుడు తన వాంగ్మూలాన్ని వెనక్కి తీసుకోవడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఆయనపై ఒత్తిడి కారణంగానే ఇది జరిగిందని, ఈ కేసును తప్పుదోవ పట్టించడానికి బీజేపీ ఎంపీ ప్రమేయంతో కార్మికుడిని అరెస్ట్ చేశారని వారు ఆరోపించారు. వాస్తవానికి ఆ ప్రాంతంలో జరిగిన తవ్వకాల్లో మహిళల అస్తిపంజరాలు దొరికాయని, అమ్మాయిల మిస్సింగ్, అనుమానాస్పద మరణాలు, కిడ్నాప్‌లు, హత్యలు, అత్యాచారాలు అనేకం జరిగాయని, ఇవి దేశ ప్రజలందరికీ తెలిసిన విషయాలేనని నాయకులు అన్నారు. 1979 వేదవల్లి సంఘటన నుండి 2014 వరకు ధర్మస్థలి ఆలయ ప్రాంతంలో జరిగిన మహిళల హత్యల గురించి నిజాలు బయటపడితే, ఆలయ పూజారిపై చర్యలు తప్పవనే భయంతోనే కేసును మూసివేయాలని చూస్తున్నారని వారు విమర్శించారు. జీపీఆర్ (గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్) సాంకేతిక పరిజ్ఞానంతో తవ్వకాలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఎంఎస్ నాయకురాలు అనిత, సైంటిఫిక్ స్టడీ ఫోరం నాయకులు చార్వాక, పీడీఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, డీఎస్ఏ కో-కన్వీనర్ శివ తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడిగా 14వ సారి తాటిపాముల ఏకగ్రీవం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఇటీవల మేడ్చల్ జిల్లా గాజుల రామారంలో జరిగిన సీపీఐ మహాసభలలో వరంగల్‌కు చెందిన తాటిపాముల వెంకట్రాములు 14వ సారి రాష్ట్ర సమితి సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ, ప్రజాసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేసి ఆయనకు అభినందనలు తెలిపారు. వెంకట్రాములు 1970లోనే విద్యార్థి దశలో సీపీఐలో చేరారు. అప్పటి నుంచి ఆయన అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్, అఖిల భారత యువజన సమాఖ్యలో జిల్లా, రాష్ట్ర బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. సీపీఐ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శిగా మూడు పర్యాయాలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఏడు పర్యాయాలు సేవలందించారు. ప్రజా సమస్యలపై, జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం ఆయన అనేక పోరాటాలు చేసి ప్రజల మన్ననలు పొందారు. ప్రస్తుతం ఆయన భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యునిగా, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షునిగా, చేతి వృత్తిదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షునిగా పలు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. 1982లో ఖమ్మంలో జరిగిన మహాసభలో తొలిసారిగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడిగా ఎన్నికైన వెంకట్రాములు, ఉమ్మడి రాష్ట్రంలో పదిసార్లు, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాలుగుసార్లు ఈ పదవికి ఎన్నికయ్యారు. తనపై విశ్వాసంతో రాష్ట్ర సమితికి ఎన్నుకున్న ప్రతినిధులకు, నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపిన వెంకట్రాములు, ప్రజా సమస్యలపై అంకితభావంతో, దీక్షతో కృషి చేస్తానన్నారు.

# కంచ నర్సింగరావుకు సత్కారం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చే జాతీయస్థాయి చేనేత జోలి శాఖ అవార్డు అందుకున్న వరంగల్ నగరంలోని 32వ డివిజన్, కరీమాబాద్ శ్రీ బీరన్న దేవస్థానం పూజారి కంచ నర్సింగరావుకు ఘన సన్మానం జరిగింది. సోమవారం శ్రీ అక్క మాంకాళి కురుమకుల పరపతి సంఘం ఆధ్వర్యంలో స్థానిక బీరన్న దేవస్థాన ఆవరణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు దయ్యాల సుధాకర్ మాట్లాడుతూ నర్సింగరావుకు జాతీయ అవార్డు రావడం వరంగల్‌లోని కురుమ కులస్తులందరికీ ఎంతో గౌరవమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అవార్డులు మరెన్నో పొందుతూ, కురుమ కుల వృత్తిని దేశవ్యాప్తంగా వ్యాప్తి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు దయ్యాల సుధాకర్, ఉపాధ్యక్షులు మండల జంపయ్య, ప్రధాన కార్యదర్శి దయ్యాల వీరేశం, సహాయ కార్యదర్శి కోరే రమేష్, కోశాధికారి బండారి అరవింద్, సహాయ కోశాధికారి కోరే చక్రధర్, ముఖ్య సలహాదారులు నరిగె శ్రీనివాస్, ఆర్గనైజర్లు నరిగె సతీష్ కుమార్, గొట్టే సదానందం, కార్యవర్గ సభ్యులు గౌడ తిరుపతి, అన్న కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. నర్సింగరావు కురుమ కుల ప్రఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటాలని ఈ సందర్భంగా అందరూ ఆకాంక్షించారు.

# మార్క్సిస్టు మేధావి.. సురవరం సుధాకర్ రెడ్డి

## ◆ ఆయన మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కమ్యూనిస్టు క్రమశిక్షణకు, ప్రజా ఉద్యమాలకు మారుపేరుగా నిలిచిన సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డికి సిపిఐ కాజీపేట మండల సమితి ఘనంగా నివాళులర్పించింది. సోమవారం మాలోత్ శంకర్ నాయక్ అధ్యక్షతన మడికొండ చౌరస్తాలో ఏర్పాటు చేసిన చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించిన సురవరం సుధాకర్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ లో చేరి విద్యార్థుల సమస్యల కోసం పోరాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఉద్యమం, పేదలకు ఇళ్ల స్థలాల కోసం, భూ సంస్కరణల అమలు కోసం ఆయన ముందుండి నడిపించారు. అంచలంచెలుగా ఎదిగి సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా, ఆపై జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. సురవరం సుధాకర్ రెడ్డి కమ్యూనిస్టుగా మత విశ్వాసాలకు వ్యతిరేకంగా కాకుండా, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడారు. తన వాగ్దాటితో భారత రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. సమాజంలో అంతరాలు లేని, సమానత్వం గల సమాజం కోసం నిరంతరం పరితపించారు. రాజకీయాలలో అనేక అవకాశాలు వచ్చినా, చివరి వరకు త్యాగాలతో, మచ్చలేని జీవితంతో ఒక నిజమైన మార్క్సిస్ట్ మేధావిగా నిలిచిపోయారు. ఎంపీగా రెండుసార్లు గెలిచి పార్లమెంట్‌లో విద్య, వైద్యం, ఇల్లు వంటి కనీస అవసరాల కోసం గళం విప్పారు. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి కుల, మతాలకు అతీతంగా జీవించాలని కృషి చేశారు. సురవరం సుధాకర్ రెడ్డి మరణం దేశానికి, వామపక్ష ఉద్యమానికి తీరని లోటు అని ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నేదునూరు రాజమౌళి, మునగాల భిక్షపతి, రాసమల్ల దీన, భూక్యా స్వరూప, కుడి స్వామి, బొట్టు భిక్షపతి, మంద సుమన్, స్వామి, మునగాల ఐలయ్య, రాసమల్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ సినిమా
సోమవారం 25 ఆగస్టు 2025
7




- ప్రశంసలు కురిపించిన సినీ, రాజకీయ ప్రముఖులు
- మరెన్నో మైలురాళ్లు చేరుకోవాలని పవన్ ఆకాంక్ష

# వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గోల్డ్ ఎడిషన్‌లో బాలయ్యకు చోటు

భారతీయ సినిమా రంగంలో 50ఏళ్ల అసాధారణ ప్రయాణాన్ని పురస్కరించుకుని అగ్ర కథానాయకుడు బాలకృష్ణకు అరుదైన గౌరవం దక్కింది. లండన్‌కి చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గోల్డ్ ఎడిషన్‌లో ఆయనకి చోటు– దక్కింది. భారతీయ చిత్ర పరిశ్రమలో ఈ గౌరవాన్ని పొందిన తొలి నటుడు ఆయనే. ఈ ఘనతని పురస్కరించుకుని ఈ నెల 30న హైదరాబాద్‌లో బాలకృష్ణను సత్కరించనుంది వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్. ఈ సందర్భంగా ఆ సంస్థ సీఈవో సంతోశ్ శుక్లా స్పందిస్తూ... నటుడిగా బాలకృష్ణ ఘనమైన వారసత్వాన్ని, హిందూపురం శాసనసభ్యుడిగా, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ఛైర్మన్‌గా ప్రజలకు అందించిన సేవల్ని ప్రశంసించారు. బాలకృష్ణ గొప్పతనం వెండితెరని మించి విస్తరించిందని, ఆయన అంకితభావం, సామాజిక సేవ స్ఫూర్తిదాయకం అన్నారు. అరుదైన ఈ గౌరవాన్ని పురస్కరించుకుని బాలకృష్ణకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో పాటు– పలువురు ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. బాలకృష్ణ సినీ రంగానికి చేసిన సేవలకుగానూ భారత ప్రభుత్వం కొన్ని నెలల కిందే పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం బాలకృష్ణ 'అఖండ 2' చిత్రంలో నటిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, సినీ నటు–డు పవన్ కల్యాణ్ సైతం సోషల్ మీడియా ద్వారా బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన సినిమాకు చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా.. ఆయన తన పోస్టులో బాలనటుడిగా తెలుగు చలన చిత్ర రంగంలోకి స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి నట వారసుడిగా అడుగుపెట్టి జానపదాలు, కుటుంబ కథా చిత్రాలు, యాక్షన్ చిత్రాలతో ప్రేక్షకులను మెప్పిస్తూ, నట జీవితంలో 50 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణం పూర్తి చేసుకున్న తరుణంలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు– సాధించిన ప్రముఖ నటులు, హిందూపురం ఎమ్మెల్యే పద్మ భూషణ్ నందమూరి బాలకృష్ణ గారికి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను. ఆయన మరిన్ని సంవత్సరాలు తన నటనతో ప్రేక్షకులను అలరిస్తూ, ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తున్నా అన్నారు.





## షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకుంటున్న టాక్సిస్

కన్నడ, తెలుగుతోపాటు పాన్ ఇండియా ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్టుల్లో ఒకటి టాక్సిక్. కన్నడ స్టార్ హీరో యశ్ లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. యశ్ 19వ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ చిత్రానికి పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ గీతు మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీని కేవీఎన్ ప్రొడక్షన్స్‌పై వెంకట్ కే నారాయణ తెరకెక్కిస్తున్నారు. లేడీ సూపర్ స్టార్ నయనతార, కియారా అద్వానీ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. కాగా ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ కోసం ఎదురుచూస్తున్న మూవీ లవర్స్‌కు అదిరిపోయే వార్తను షేర్ చేశారు మేకర్స్. ప్రస్తుతం 45 రోజుల యాక్షన్ షెడ్యూల్ కొనసాగుతోంది. హాలీవుడ్ యాక్షన్ డైరెక్టర్ జేజే పెర్రీ పర్యవేక్షణలో ఈ షెడ్యూల్ నడుస్తోంది. ఈ షెడ్యూల్‌లో పాల్గొంటు–న్న స్టంట్‌మ్యాన్లు అంతా భారత్‌కు చెందిన వారే కావడం విశేషం. హాలీవుడ్ స్టంట్ డైరెక్టర్‌తో భారత బృందం పని చేసే అవకాశం రావడం నిజంగా అరుదైన అవకాశమనే చెప్పాలి. టాక్సిక్ చిత్రంలో బాలీవుడ్ భామలు హ్యూమా ఖురేషి, టారా సుటారియా కీ రోల్స్‌లో నటిస్తుండగా.. అక్షయ్ ఒబెరాయ్ మరో కీలక పాత్ర పోషిస్తున్నాడు. కేజీఎఫ్ ఫ్రాంఛైజీ తర్వాత యశ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై అంచనాలు భారీగానే ఉన్నాయి. టాక్సిక్‌లో రుక్మిణి వసంత్‌ను కీలక పాత్ర కోసం తీసుకున్నారని ఇప్పటికే ఆమెకు సంబంధించిన రెండు షెడ్యూల్స్ కూడా పూర్తయ్యాయని వార్తలు హల్ చల్ చేస్తుండగా.. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.




## చవితి రోజు ఓజి నుంచి సువ్విసువ్వి పాట విడుదల

కథానాయకుడు పవన్ కల్యాణ్ 'ఓజీ'తో థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన.. ప్రియాంక అరుల్ మోహన్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని సుజీత్ తెరకెక్కించారు. డీవీవీ ఎంటర్–టైన్‌మెంట్ సంస్థ నిర్మించింది. ఇమ్రాన్ హష్మీ ప్రతినాయకుడిగా నటించారు. ఈ సినిమా సెప్టెంబరు 25న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ నెల 27న వినాయక చవితి సందర్భంగా దీంట్లోని 'సువ్వి సువ్వి' అనే గీతాన్ని విడుదల చేయనున్నారు. అందులో పవన్, ప్రియాంక జంటగా నీటిలో దీపాల్ని వదులుతూ కనిపించారు. ఇది ముంబయి నేపథ్యంగా సాగే గ్యాంగ్‌స్టర్ డ్రామా కథతో రూపొందింది. పవన్ ఇందులో ఓజాస్ గంభీర అనే శక్తిమంతమైన పాత్రలో కనువిందు చేయనున్నారు. ఈ చిత్రానికి తమన్ సంగీతమందిస్తున్నారు. అభిమానులు త్వరలో రాబోయే క్షఏ సినిమా కోసం భారీ అంచనాలతో ఎదురుచూస్తున్నారు. ఇటీ–వల విడుదలైన మొదటి పాట సెన్సేషన్ క్రియేట్ చేయగా. ఈ పాటకు సంబంధించిన పోస్టర్‌లో పవన్ కళ్యాణ్, హీరోయిన్ ప్రియాంక రొమాంటిక్ స్టిల్‌లో కనిపించారు. దీపాల కాంతుల్లో ఇద్దరూ ప్రకాశిస్తున్నారు. ఇక ఆ పోస్టర్‌లో పవన్ కల్యాణ్ కుడి చేతిపై జపాన్ భాషలో మూడు పదాలు టాటూ రూపంలో ఉన్నాయి. వాటి అర్థం ఎంటా అని అభిమానులు తల కొట్టుకుంటున్నారు. అయితే సమాచారం ప్రకారం.. మొదటి అక్షరం: ప్రామిస్, రెండో అక్షరం: బలం , మూడో అక్షరం: ఫైర్ దీని అర్థం అంట. ఈ వార్త వైరల్ అవుతుంది. ఈ పవర్‌ఫుల్ వర్డ్స్.. ఈ మూవీలో పవన్ కళ్యాణ్ క్యారెక్టర్‌కు ప్రత్యేకత, సెన్సేషన్‌ను ఇస్తున్నాయి.



WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, ఆగస్టు 25, 2025



# మట్టి గణపతులను పూజించండి

- పర్యావరణాన్ని కాపాడండి
- ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్ రతన్ సింగ్ ఠాకూర్

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్ రతన్ సింగ్ ఠాకూర్ పిలుపునిచ్చారు. ఏవీవీ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కోడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్ రతన్ సింగ్ ఠాకూర్ విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. కొడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏవీవి కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజల్లో మార్పు మొదలైందన్నారు. మట్టి వినాయకుల వినియోగం ప్రస్తుతం 25శాతం ఉందని, రానున్న రోజుల్లో 40 శాతానికి పెరుగవచ్చన్నారు. పీఓపీ వద్దు మట్టి వినాయకులే ముద్దు నినాదంతోపాటు గణపతి పూజలో ఉపయోగించే ఇరవై ఒక్క రకాల పత్రిలు వాటి ఔషధ గుణములతో సర్వ రోగాలు పోతాయని తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీనివాసరావు తయారుచేసిన ఔషధ మొక్కల విలువలకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్ అధ్యాపకుడు సర్వేశం, సీనియర్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రబ్బాని, దేవిశ్రీప్రసాద్, సాకేత్, చిరంజీవి, దస్తగిరి, క్రాంతి, భరత్, శివశంకర్, నమ్రత, చందన, ప్రవళిక, మన్విత, సుహన, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.



### 42 వ డివిజన్ లో..

పర్యావరణాన్ని కాపాడడానికి మట్టి గణపతులను పూజించాలని 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ అన్నారు. అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ-మురళీధర్ లు వెయ్యి, నగర మేయర్ గుండు సుధారాణి కార్పొరేషన్ ద్వారా మరో 300, మొత్తం 1,300 మట్టి వినాయక విగ్రహాలను పంపించగా వాటిని సోమవారం రంగసాయిపేటలోని మహిళా స్వశక్తి భవన్ లో స్థానిక కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్, మాజీ కార్పొరేటర్ కేడల పద్మా జనార్ధన్, మహిళా నాయకురాలు మంతెన సునీత, డివిజన్ అధ్యక్షులు ఏలుగు సాంబేశం, నాయకులతో కలిసి పేదలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొలుగొద్దు అనిల్, కర్ర కుమార్, సయ్యద్ బషీర్, కంచ మల్లయ్య, వనం వేణు, అవునూరి కుమార్, పాలకుర్తి సుమన్, సోమ అనిల్, ఉప్పునూతల శివ, జింక కుమార్, మునుకుంట్ల విజయ, కానుగంటి పద్మావతి, చిట్ల హేమలత, బక్కి కల్పన, మునుకుంట్ల అరుణ, అదుప లలిత, మెప్మా సి ఓ ప్రవీణ్, ఆర్పీలు మాడిశెట్టి కవిత, ఏలుగు రమ, బక్కి రమాదేవి, చిమ్మని భార్గవి, కైరంకొండ మహేశ్వరి, ఓబీలు శంకేషి రాధిక, అదుప కవిత, మున్సిపల్ జవాన్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### 40వ డివిజన్ లో..

గణపతి నవరాత్రుల ఉత్సవంలో మట్టి వినాయకులను పూజించాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి ప్రజలను కోరారు. సోమవారం కరీమాబాదులోని శ్రీ రామస్వామి దేవాలయం సమీపంలో మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో తయారు చేసిన 300 మట్టి విగ్రహాలను కార్పొరేటర్ మరుపల్ల రవి ప్రజలకు పంపిణీ చేశారు. రసాయనిక పదార్థాలతో కూడిన విగ్రహములను గణపతి నవరాత్రుల ఉత్సవంలో ఉపయోగిస్తే పర్యావరణం దెబ్బతిని చెరువులు కలుషితమై ప్రజలు అనారోగ్యానికి గురవుతారన్నారు. రసాయనిక పదార్థాలతో తయారుచేసిన ఆకర్షణీయమైన విగ్రహాల పట్ల ప్రజలు మొగ్గు చూపుకూడదన్నారు. మట్టితో తయారుచేసిన వినాయక విగ్రహాలకే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఓ సునీత గౌడ, సుభాష్, శోభ, స్రవంతి, మాధవి, రాజేశ్వరి, స్వర్ణలత, పద్మ, వీణ, జవాన్ కృష్ణ పాల్గొన్నారు.



# బేకరీలో బూజు పట్టిన కేకులు

### తిన్న నలుగురికి అస్వస్థత

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** కాలం చెల్లి బూజు పట్టిన కేకులను అమ్ముతూ.. ప్రజల ప్రాణాలతో తొర్రూరు పట్టణ కేంద్రంలోని బెంగుళూరు అయ్యంగార్ బేకరీ సిబ్బంది చెలగాతమాడుతోంది. వారు విక్రయించిన బూజు పట్టిన కేకు తిని నలుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సోమవారం బేకరీలో విక్రయిస్తున్న కేకులను కొందను కొనుగోలు చేశారు. కేకులపై పేరుకు పోయిన ఫంగస్ ను గుర్తించకుండా తిన్నారు. దీంతో వారు వాంతులు, విరేచనాలతో మంచం పట్టారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇలాంటి బేకరీపై సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు.



# చేనేత కవితా సంపుటి ఆవిష్కరణ

### రచించిన పాలకుర్తి మధుసూదన రావు

**వరంగల్ వాయిస్, బీమారం :** బీమారంలోని అగస్త్య బ్రాహ్మణ భవనంలో జరిగిన ఆబోప అవార్డుల ప్రదానోత్సవ సభలో పాలకుర్తి మధుసూదన రావు రచించిన చేతన కవితా సంపుటిని ఆచార్య మాడభూషణం రాజగోపాలచార్య ఆవిష్కరించారు. తదుపరి సంగీత సాహిత్య నృత్య కళానిధి పురస్కార ప్రదానోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. మోత్కూరు మనోహర్ రావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథులుగా కాకతీయ విశ్వవిద్యాలయ ఆంగ్లవిభాగం విశ్రాంతచార్యులు మాడభూషణం రాజగోపాలచార్య పాల్గొన్నారు. ప్రముఖ కవియిత్రి, రచయిత్రి, కార్టూనిస్ట్, ఆంధ్రబ్యాంక్ విశ్రాంత సీనియర్ మేనేజర్ నెల్లుట్ల రమాదేవికి సాహిత్యకళానిధి అవార్డును, మధురకవి మోత్కూరు మధుసూదనరావు స్మారకంగా ప్రముఖ సంగీత విద్వాంసులు, మ్యూజిక్ డైరక్టర్, ఖమ్మం స్వరసుధ అధ్యక్షులు కొమర్రాజు మాధవరావుకు సంగీతకళానిధి అవార్డును, మోత్కురు అరుణదేవి స్మారకంగా ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యులు ఈటూరి సాయిచరణ్ కు నృత్యకళానిధి అవార్డును మోత్కూరు పార్థసారధిరావు స్మారకంగా ప్రదానం చేశారు. ఈ అవార్డు క్రింద రూ.5000 పారితోషికాన్ని అందించిన ప్రదాతలు డాక్టర్ మోత్కురు మాణిక్యరావు, మోత్కురు వెంకటరామారావు, మోత్కూరు మధుకర్ రావులకు అధ్యక్షుడు మనోహర్ రావు ధన్యవాదములు తెలియజేశారు. ఈ సభలో అవార్డు కమిటీ చైర్మన్ డాక్టర్ ఎన్వీఎన్ చారి, ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దినకర్, కోశాధికారి చిట్టంపల్లి రవీందర్ రావు, ఆచార్య ఎం.ధర్మేంధర్ రావు, జయప్రసాదరావు, విశ్వనాధం, ముసిపట్ల శ్రీనివాసరావు,,శ్యాంసుందర్ రావు, ప్రకాశ్ రావు, దేవులపల్లి సుదర్శన్ రావు, శ్రీకాంత్, మహేందర్ రావు, అజయ్ కుమార్, రామన్న, గోపాలకృష్ణమూర్తి, వెంకట్, ప్రవీణ్, మహిళాసభ్యులు ఇందిర, శ్రీదేవి, రేణుక, సుస్మిత, రాజకుమారి, రమ, ఉమ, సుమన, మధూలిక, గిరిజ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళిని దర్శించుకున్న సింధు మాతాజీ



హైదరాబాద్ గచ్చిబౌలిలోని శ్రీ భద్రకాళి పీఠంనకు చెందిన సింధు మాతాజీ సోమవారం నగరంలోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన సింధు మాతాజీకి ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. పూజానంతరం ఆలయ మహామండపంలో అయ్యగారు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాతాజీ వెంట టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు, భైరవ్, మల్లిఖార్జున్, సునిలా తదితరులున్నారు.

– వరంగల్ వాయిస్, వరంగల్

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE. EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com